# పంచచామరం

కడుపునిండిన...బేరం!

—నిండుకుండ...అప్పుడే తొణకడానికి ప్రారంభించింది. ఒళ్ళుపొగరుకాకపోతే... చూస్తేనే...కడుపు నిండుతుందా?—

నిజంగా...ఆ అమ్మాయి అలానేఉంది; అయితే మాత్రం?— ఎంత ఒంటరిగా కూర్చుని ఉంటేనేం... ఎగాదిగా చూస్తూ...ఎదురుగా దీపస్తంభాన్ని ఆనుకొని చదికిలబడటం నాకు అప్పుడు అదేం పోయేకాలం?

ఏ రైలుకు వెళుతుందో?...

ఎటువెళ్ళినా...ఇంకా అరగంటదాకా ఎక్కడికీ బండిలేదుగదా?...ఇంతలో, కలిసిరావాలికాని...ఎంత గ్రంథం నడవకూడదు?— ఏమో తీరా, పాకానపడబోయే సరికి, అంతవరదాకా...అలా ఓచోట కూలేసి ఏరాజ్యాలో ఏలబోయిన - ఆ ఘనుడు...మెడను త్రాడుబిగించిన ఎవరో ఆ వెధవాయ- తీరా తగుదునని ఆసమయానికి అక్కడకు తయారైతే...మనం యిక అటూయిటూ మెసలడానికి ఏమాత్రమూ వీలుండదు...మన వేషాలేమీ సాగవు...అనవసరంగా...సిద్ధాన్నం...ఆ కాస్తా చెడి ఊరుకుంటుంది.

అయినా, అందాకావచ్చినతరువాత...అప్పటిసంగతి

చూసుకోవచ్చును; యిక యథావిధిగా కార్యక్రమానికి ఉప క్రమించవచ్చును...

ఎంతసేపు చూస్తూ కూర్చున్నా, బాగానేఉంటుంది. యింకా...యింకా చూడాలనే ఉంటుంది.

నేను క్రీనీడలో ఉంటిని; వెలుతురుఅంతా ఆ అమ్మాయిమీదకే ఉరుకుతూంది;

నా మనసు...

నేనలా...జపంచేస్తూ కదలక మెదలక ఎంతసేపు కూర్చున్నా, ఏంలాభం? – అక్కడ...ఆ రవంతదూరంలో తనకోసం ఒకడు తపించిపోతున్నాడని ఆమెకు ఆ ప్రాంతాల మనిషిఅలికిడిఅయినా...ఎలాగో తెలియాలికాదూ,ముందు!

అందరికీ ... తెలిసిన చిట్కా ... గొంతుసవరించు కోవడం: నా శాయశక్తులా...ఎన్నిమాదిరులలోనో... ఎన్నిస్థాయిలకో...ఆపకుండా దగ్గాను: జర్మనుభాష నేర్చు కుంటూన్నప్పటి కొరమారడంపంపిణీమీదనే...శబ్దించాను. ఉహుం...తననికాదన్నట్టు ... తిరిగిచూడన్నా చూడకుండా- ఆ అమ్మాయి అదివరకు చూసేవైపే...చూస్తున్నది—

అంతేనేమో ఎన్నటికీ రివాజు! వినిపించకుండా ఉంటుందా...నేను అంతసేపటినుంచీ అన్నిరకాలుగా గొంతుచించుకుంటూంటే?-పోనీ...అందులో ఏదో విశేషం ఉందని గ్రహించగలతాహతు లేకపోవచ్చును - కాని... ఎవరో పాపం...ఎంత బాధపడుతున్నాడో అని...సామా న్యంగా అందరూ జబ్బువాడికేసి చూపించే...జాలి...అందు కని అయినా...నావంక తిరగవచ్చునే?

ఎందుకైనా మంచిది అని - కొంచెం ముందుకు జరిగాను... యిక మనలోపం లేదు ... కనుముక్కుతీరు... నొక్కులక్రాఫింగు యిత్యాదులు వెలుతురులో... స్పష్టంగా కనబడితీరకతప్పదు - ఆమె, మెడనరాలు కొంచెం సడలించి యిటుచూసేపక్షంలో-

—'ఆ అమ్మాయి నావంక తిరిగిచూడాలి'-అనేది మాత్రంచేసి... దానికో వేయి వారువాల వేగం కలిపించి ... మనసును మెలివేసి... కనుమూసి కను తెరచేటంతకాలంలో లక్షసారులు జపించాను... ఆమీద కొసరుగా... పోనీ, పాపం అని మళ్లా ఒకసారి... సత్తువకొద్దీ సకిలించాను-యింతకాండ జరిగినా... యింకా, వేసినచోటే ఉన్నాను.

తరువాత - ఎత్తు...

—ఆవైపునుంచి వెళుతూన్న కూలీకుర్రవాడిని పిలిచి, 'ఆమె, ఏరైలుకు వెళుతుందో కనుక్కో, వెంట ఎవరూలేకుండా, ఒంటరిగా వచ్చినట్టుంది, పాపం! టిక్కెట్టుఏమన్నా తెచ్చిపెట్టాలో - ఏమో...అడుగు...'అని ఆమెదగ్గరకు తోలాను. వాడు...అక్కడకు వెళ్ళి నేను అడగమన్న దంతా - అక్షరం తప్పకుండా...నాకు వినపడేందుకు, బిగ్గరగా - ఒకసారికి నాలుగుసార్లు అడిగాడు. చివరకు, వాడికే విసుగువచ్చినట్టుగా ఉంది...తిరిగివచ్చి...చప్పరించి పెదవి విరిచాడు: నేను - పరధ్యానంగా తలఊగించాను - (అంటే...అక్కడ మళ్ళా కొంత టాక్యంఉంది: మనం ఏమాత్రమున్నా ఆదుర్దా కనబరుస్తే...యిదేదో వ్యవహారం గదా అని వాడు పసిపట్టి, అటోయిటో తేలేదాకా అక్కడే

తారటలాడుతుంటాడు: వాడిముడుపేదో వాడికి చెల్లినా... ఎట్లైనా... ఆవిషయం ఆ మరునిమిషంలో ఆలా ఆలా నాలుగుమూలలా ప్రాకి... అందరూ మనవంక అదోమాదిరిగా చూడటం... ఈగోడవేదీ లేకుండా... 'ఏదో దయదలచి ఆడకూతురు ఒంటరిగా ఉన్నదికదా అని... కనుక్కో మన్నారే కాని, అయ్యగారికి అంతకన్న వేరే అభిప్రాయం ఏమీలేదు–' అని వా డనుకునేట్టుగా మనం అభినయించితే ఉత్తరత్ర ఏ చిక్కూ ఉండదు: అదీ సంగతి) –

అక్కడితో, ఆ ఆశకాస్తా మాయమైంది. ఇంక అనంతర కరణీయం బెయ్యది?

ఏదీ పాలుపోక... మళ్ళా మొదటికే వచ్చాను. అలా కూర్చుని, అదేపనిగా, ఏమిచేయడమా అని ఒకటే ఆలోచన.

అదేవరుసను కనబడ్డ అందరిచేత – అతితెలివిగా రాయబారాలు నడిపాను: పళ్ళుఅమ్మేవాడు – సోడాసాయెబు, బిస్కత్తులూ, నాన్‌రొట్టె ముసలివాడు, – ఒకరేమిటి అందరినీ... నాకు అందుబాటులోవున్నవాళ్ళందరినీ... 'అదిగో ఆ అమ్మాయి... అవి కావాలంటూంది, కనుక్కో' మని అక్కడికి తోలడం, వాళ్లు తీరా అందాకా వెళ్ళి... ఆమెనడిగి... నేను పంపించానని నావంక చూపించి... ఏమాటా రాకపోతే... ఎంతసే పక్కడ అవతల బేరం చెడగొట్టుకుంటూ ఆలా నిలుచుంటారు గనుక... ఎగువకు వెళ్ళిపోవటం... యీలా, పుణ్యకాలంకాస్తా గడచిపోతూంది...

టిక్కెట్టు కలెక్టరు వచ్చి...తలుపులు తెరిచాడు. ప్రయాణీకులు ఒక్కరొక్కరే యివతలకు వస్తున్నారు. ఇంకా కొంచెం సేపటికి...అంతటా మనుష్యులేఅవుతారు - అప్పుడు మన ఆట లిక సాగవు - యీలోగానే ఏమన్నా—

ఆమెకు కనబడేటట్లుగా... నాలుగుసార్లు అటూ యిటూ ఆమెముందునుంచే పచారుచేశాను.

ఆమెను నేనైతే పరకాయించిచూడటానికి బాగా వీలుచిక్కింది, కాని...ఆ అమ్మాయి...నావంక ఒక్కసారైనా చూడందే...

'అంత కొమ్మెక్కికూర్చునేందుకేం - ఆకాశంనుంచి దిగివచ్చిందా, అబ్బో! చాలాదాకా ఉన్నదే...' అనుకుని విసువుతో...అటు వెళ్ళి టీ త్రాగి, త్రాగుతూ మళ్ళా ఆలోచించాను.

ఎవరా అమ్మాయి?

మనవైపులపడుచులాగా లేదు. కాని చూడటానికి మా మజాగా ఉన్నది—

ఆమెకు...అటూయిటూచూసేఅలవాటన్నా లేదా... లేకపోతే అదంతా మన అదృష్టమా?

ఒకవేళ ఆ అమ్మాయి అటువంటిది కాదేమో?— ఊహుఁ - అటువంటివారంటూ ప్రత్యేకం ఉంటారా? - ఆ సమయంఅంటూవచ్చి అన్నీ అలా ఒనగూడాలికాని...అంతకుముందంతా అవనీ, కాకపోనీ...దిగడం...మూడునిముషాలు పట్టదు...అందుకు సరిఅయినవాడు దొరకాలి...కాని...

కాని...అవన్నీ మనం ఎందుకు కాకూడదు ? - ఎందులోఅయినా లోటా - అందం చందం...

ఏమిటో అన్నీ అర్థంలేకుండా-తలా తోకా కనబడని వెధవఊహాలు: ఒకదానికొకదానికీ సంబంధంలేదు...సబబూలేదు: కాని, ఆ వేడిమీద అవన్నీ తోచుతాయీ? ఎదురుగాఉన్నది-రంభ! ఏలా స్వర్గానికి ఎగబ్రాకటం?-అంతవరకే!

అక్కడ...ఆ అమ్మాయిదగ్గర...చుట్టూ ఎవరో మనుష్యులు. నిలుచున్నారు. బిగ్గరగా మాటలు వినబడుతూన్నవి; యిండాకటంతచేరువకు వెళ్ళకుండా...కొంచెం అవతలగా నిలుచుని, ఏమిటా అని చూస్తున్నాను...ఆ అమ్మాయిదగ్గిర ఉన్న బట్టలమూటమీద ఒరిగి పడుకుని... వెక్కి వెక్కి ఏడుస్తూన్నట్టుగా...పక్క లెగురటం ... కనిపిస్తూంది: ఎవరో, ముసలాయన దగ్గిరగా గొంతుకూర్చుని, సముదాయింపుగా ఏదో చెపుతున్నాడు...ఎవరికితోచిన మాటలు వారంటూన్నారు. చుట్టూఉన్నవాళ్లు—

"—బంగారంవంటి పిల్ల

"అలాటివాడు, మరి పెళ్ళి ఎందుకుచేసుకోవాలీ—

"—దీనిగొంతుకోయడానికి !

"—పాపం రంభలాగుంది ! వాడికళ్ళకు యిది బాగుండలేదు - వెధవ -!

"—ఎక్కడిదేశం, ఎక్కడికెక్కడ! అడవిలోదించేసి వాడిత్రోవ వాడు చూసుకున్నాడు. ఆ చాకలిదానిమాత్రం చేయలేదుకాబోలు చేసుకున్న పెళ్ళాం—"

"ఎందుకు చేస్తుందయ్యా...కండకావరం యిప్పుడదేమీ కనబడనీయదు... అది రేపు ఈపాటికి యింకోడిని తగులుకుపోతే...అప్పుడు ఎక్కడెక్కడ అని వెదుక్కుంటూ మళ్ళా పెళ్ళాం కావాలని తయారవుతాడు."

"—పెళ్ళాం కావాలీ? – అసలు యిలాటి వెధవకు పిల్లనిచ్చినవాళ్ళని... పాత చెప్పొకటి పుచ్చుకుని, ఆ చెంపా యీ చెంపా వాయించాలి. ముందు – ఎన్నడూ యీలాటిపనిచేసి...అక్కునా అక్కునా అమాయకురాలి గొంతు కోయవుకదా – కోయవుగందా–అని"

"—వాడిని...కనబడితే...నిలువునా చీల్చినా పాపంలేదు–"

"—ఆఁ – ఇహ ఒకళే కనబడటం–మళ్ళా ఏముఖం పెట్టుకుని వస్తాడు: ఎక్కడో కుళ్ళి కుతమారి..."

"ఆ అమ్మాయిపని అన్నిందాలా అధోగతిఅయింది ... దేశంకానిదేశం...మన మాటా మనమంచీ లేకపోయెను. యింతకూ ఆ పుణ్యాత్ము డెవరో కాని...యిన్నాళ్ళనుంచీ యింట్లోఉండి...అద్దెఎగవేసి...అసలుశాల్తీ మాయమైనా– ఆ దండుగకు తోడు...యిప్పుడు బోలెడంత పోసి టిక్కెట్టు కొనియిచ్చి...చెంగునకట్టుకు, దోవలో వాడుకోమని, గుప్పెడురూపాయలు, బతిమాలి, చేతిలోపెట్టాడయ్యా! కడుపునపుట్టిన బిడ్డకోసమన్నా మన మంత తాపత్రయపడం... పాపం! ఆ అమ్మాయికన్న ఎక్కువగా కళ్ళనీళ్ళుపెట్టుకుంటున్నాడు...'అమ్మా, యిన్నాళ్ళనుంచీ మా యింట్లో పిల్లలాగా ఉన్నావు...వెళుతున్నావా' అని... 'నీ కేం

భయంలేదమ్మా...త్రోవపొడుగునా...ఎవరో ఒకరు నీకు సాయంగాఉండి...నీ పుట్టింటికి జేరేదాకా...ఆ ఏర్పాట్లన్నీ నేను చేశాను...సుఖంగా వెళ్ళిరా మా తల్లీ...అని... చూస్తూంటే నాకే ఏడుపువచ్చింది—"

"అవును, ఎవరో ఒకరన్నా ఊరికి ఆలాటి ధర్మ రాజులుండబట్టే...పచ్చికలి యింకా భగ్గుమనకుండా లోకం యింతమాత్రంగానన్నా ఉంది..."

"—లేకపోతే అందరూ ఆ మొగుడిలాటి పనికి మాలినవెధవలే అయితే...ఆడవాళ్ళందరూ ఇక కట్టకట్టుకుని, ఏ గంగలోనన్నా దిగవచ్చు—"

అవన్నీ - చుట్టూ నిలుచుని యింతదాకా చోద్యంగా చూస్తూన్నవాళ్లు అనుకుంటూన్నమాటలు-వింటూంటే... వింటున్నకొద్దీ... నేను చేసిన దారుణం... తలకెక్కి—పోతూంది...

—చేసుకున్న మొగాడు మోసంచేసి...పొట్టచేతబట్టుకుని...యింతదూరం వచ్చి...యీ అధ్వాన్నపడవిలో పారేసి...అతీగతీచూడకుండా పోతే...పుట్టెడుదుఃఖంతో రాయై...కదల మెదలకుండా...ఆ అమ్మాయి అక్కడ పడిఉంటే...నేను చూసి రోట్టలువేశాను...!

ఏమేమో చేదామని చూశాను...కాదూ, నేను... మీసంఉన్నమగవాడిని...పెద్దమనిషిని...నలుగురిలో మెలగ నేర్చినవాడిని...

అవతల...ఆడది—

నేను—మగవాడిని...ఛీ...

తెగ్గోస్తే...కోసే కత్తికికూడా... నా పాపం చుట్టుకోదూ... నిజానికి... ఏమిటి నా ఊహ...ఏంచేదామని...రాస్కెపు...ఆ పిల్లతో...కళ్ళతో చెలగాటమాడి...రైల్లో ఎక్కేదాకా చూసి...చూసి, ఏదోఘనకార్యంచేసినవాడిలాగా యింటిదాకా...కూనిరాగంతీసుకుంటూ నడిచి...అనవసరంగా...ఆ ప్రస్తావన క్లబ్బులో...తీసుకువచ్చి...అక్కడ మన ప్రతాపం అందరితో చెప్పి...అంతేనా...

పోనీ, మాటవరుసకు...ఆ అమ్మాయి...నాఅంత సుందరుణ్ణి ఎన్నడూ కలలోనైనా చూడనంత తలకుమాసి సరై – సైఁ – అన్నదంటే మాత్రం...అప్పుడు అమాంతం ఆపాళాన రైలుఎక్కి...అంత తాహతు ఉందా? –ఊహుఁ –

గడుసరిదై – మామూలుధోరణిలోనే ఉండి...మన వాలకం చూసి...కంతుమని లేచినట్లాయెనా...యిక మళ్ళా మరునాడు ఊళ్ళో తలఎత్తుకు తిరగవీలుందా—

ఆ చేసుకున్న వెధవకన్న నే నేం మెరుగు?—

యీలాంటివెధవలు (మన్నికూడా కలుపుకుని) ఉండబట్టే...యిలా తగులబడుతూంది; యింకా తగులబడుతుంది—

—రైలు ఏనాడో వెళ్ళిపోయింది...

దోవపొడుగునా...నన్ను నేను దులుపుకుంటూ...ఎన్ని గుణపాఠాలో నేర్చుకుంటూ ... అంతకుపూర్వం నేర్చుకుని మూలపడవేసినవి మళ్ళానెమరుకు తెచ్చుకుంటూ...క్రమంగా నేను – నాలోకి – నాలోనుంచి ప్రపంచంలోకి...ప్రపంచంమీదనుంచి పరమాత్మమీదకి ... అక్కడనుంచి

మళ్ళా ఒక్కవిసరున ఆత్మమీదకీ...పుణ్యం - పాపం... చీకటిలో - వేదాంతమార్గాలన్నీ గుర్తులుపెట్టుకుంటూ, పట్టాలవెంబడి నడచి...రోడ్డుఎక్కి మళ్ళా వెలుతురులోకి వచ్చాను...

సోడా ఫౌంటెన్ దగ్గిర...డ్రింక్ మీద డ్రింకు...కడుపు నిలువునా చల్లబడి...గుక్క మీద గుక్క...సిగరెట్‌తో కళ్ళలోకి తెలివివచ్చి...ప్రొద్దుపోతున్నదికదా అని...సత్తువతో కాలుసాగించుతూ...

ఆ మేడముందు...పున్నాగచెట్టునీడను, గేటును ఆనుకుని...క్రీనీడలో తెల్లచీర...తళుక్కుమని చూచాయగా కమ్మలూ...తలలో మల్లెపూలున్నట్టుగా గురుతూ - అంత దూరాన్నుంచే కంటికితగిలేటప్పటికి...

అలవాటుచొప్పున...

అంతా మరచిపోయి...

ఆమె ఎవరో...అక్కడనుంచే కదిలిన తరువాత... వెలుతురులోకి వస్తే...ముఖమన్నా కనబడుతుందికదా అని...

వెధవ అలవాటుచొప్పున - అక్కడ ఆగాను ఓ క్షణం—

——